అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి 1
సోమవారం 15 మే 2023

చైన్ స్నాచింగ్ దుండగుల అరెస్ట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని 4వ టౌన్ పరిధిలో శనివారం హౌసింగ్‌బోర్డు కాలనీలో యువతి మెడలో నుంచి రోల్డ్‌గోల్డ్ చైన్, సెల్ ఫోన్ ను దొంగిలించిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు నగర సిఐ వెంకటనారాయణ తెలిపారు. ఆదివారం నగర సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సీసీటీవీలో దొరికిన పుటేజీల ఆధారంగా వారు దొంగతనానికి యత్నించిన బైక్ ఆధారంగా కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిపేట్ మండం వెల్లుట్ల కు చెందిన పశులది చంద్రశేఖర్ ప్రస్తుత నివాసం వినాయక్ నగర్, వినాయక్ నగర్ కు చెందిన బొడిగళ్ల తేజ అనే ఇద్దరు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రోల్డ్ గోల్డ్ చైన్ తో పాటు వారు దొంగతనానికి యత్నించిన బైక్, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. 24 గంటల్లోనే కేసు ఛేదించిన 4వ టౌన్ ఎస్ హెచ్ వో సందీప్, ఎస్సై తిరుపతి, కానిస్టేబుల్ రమేష్, నీలేష్, వేణులను సిఐ అభినందించారు.

16 వరకు ఇంటర్ సప్లమెంటరీ ఫీజు గడువు

- రీవాల్యుయేషన్, రీ కౌంటింగ్‌కూ ఫీజు చెల్లించొచ్చు

నవతెలంగాణ-రామారెడ్డి

ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరంలో ఫెయిల్ అయిన విద్యార్థులు, సప్లమెంటరీ పరీక్షల కోసం ఫీజు చెల్లించేందుకు ఈనెల 16వ తేదీ వరకు గడువు ఉందని రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మధు శ్రీవాత్సవ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గడువు ముగియనున్నందున విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఇంటర్మీడియట్ ఫలితాలపై రీకౌంటింగ్, రివాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఈనెల 16 తేదీ వరకు ఫీజు చెల్లించాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్ హయాంలోనే తండాల అభివృద్ధి

- ఎమ్మెల్యే హన్మంత్ షిండే

నవతెలంగాణ-పిట్లం


ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే షిండే

మండలంలోని గౌరారం తండాలో ఆదివారం ఎమ్మెల్యే హన్మంత్ షిండే, ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, తండావాసులతో కలిసి జగదంబ మాత, సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజన అభివృద్ధికి గాను సీఎం కేసీఆర్ ఎంతగానో తోడ్పడుతున్నారని అన్నారు. తండావాసులకు సముచిత న్యాయం కల్పించాలని దృక్పథంతో 500ల జనాభా ఉన్నా తండాలను గ్రామపంచాయతీలుగా తీర్చి దిద్దిన ఘనత బిఆర్ఎస్ పార్టీకే దక్కిందన్నారు. గ్రామాల అభివృద్ధితోపాటు తండాల అభివృద్ధికి గాను బీటీ , సి సి రోడ్లు , మురికి కాలువలు నిర్మించి, తండాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లారని అన్నారు. అనంతరం తాండ వాసులతో కలిసి ప్రత్యేక హోమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా బంజారా నాయకులు, మండల ప్రజా ప్రతినిధులు , తండావాసులు , బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సండే స్కూల్‌లో ఆరోగ్య మేళా

నవతెలంగాణ-కంఠేశ్వర్



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డీఎంఅండ్‌హెచ్‌వో సుదర్శనం అధ్యక్షతన నగరంలోని కంఠేశ్వర్‌లో గల సీఎస్ఐ సండే స్కూల్‌లో ఆదివారం ఆరోగ్య మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి, కీటకాజనీత వ్యాధులు మలేరియా, డెంగ్యూ మొదలైన అంటువ్యాధుల పైన అవగాహనా వ్యక్తిగత పరిశుభ్రత తదితర విషయాలను విద్యార్థులకు వెల్లడించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విశాల రాణి, డీపీవో స్వామి సులోచన, సండే స్కూల్ సిబ్బంది, ప్రిన్సిపల్ ప్రభావతి, రవి, జీవన్ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ బురుజుపై జాతీయ జెండా

నవతెలంగాణ-నసురుల్లాబాద్



బాన్సువాడ పట్టణంలో బండగల్లిలో గల చారిత్రక బురుజుపై జాతీయ జెండా ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ తెలిపారు. ఆదివారం బండగల్లిలో ఉన్న బురుజుపై జెండా ఏర్పాటుకు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అతి పురాతనమైన బురుజుపై జాతీయ జెండా ఎగురవేసేందుకు స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో బుర్జుపై జాతీయ జెండా ఏర్పాట్ల పనులు సాగుతున్నాయన్నారు. పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.



రోడ్లమీదే ఆశలు

- ఎక్కడి ధాన్యం బస్తాలు, కుప్పలు అక్కడే
- కాంటా అయినా తరలించలేని దైన్యం
- లారీలు లేక నిలిచిన ధాన్యం తరలింపు
- కడ్తా, తరుగు పేరిట అన్‌లోడింగ్‌కు రైస్‌మిల్లుల కొర్రీలు
- రైస్‌మిల్లుల వద్ద నిలిచిన లారీలు

నవతెలంగాణ-మాక్లూర్

అకాల వర్షాల నుంచి తెరుకొని పంటను ఆరబెట్టి విక్రయించేందుకు సర్వం సిద్ధం చేయగా.. కాంటా అయినా ధాన్యం తరలించకపోవడంతో ఎక్కడి కుప్పలు అక్కడే దర్శనమిస్తున్నాయి. కోతలు ఆలస్యమై.. వర్షాలు, వడగండ్లతో తీవ్ర నష్టం వాటిల్లగా.. వచ్చి కొద్ది మేర పంటను ఆరబెట్టి కాంటా చేయించగా.. సకాలంలో తరలించకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ వర్షం కురిస్తే.. తాము మరింత నష్టపోతామని వాపోతున్నారు. ప్రస్తుతం ఎండలు ముదరడంతో కొనుగోళ్లు వేగవంతంగా సాగుతున్నాయి. అయితే లారీలు రైస్‌మిల్లుల వద్ద బారులు తీరి ఉన్నాయి. కడ్తా ఎక్కువ చెల్లిస్తేనే ధాన్యం అన్‌లోడ్ చేసుకుంటున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు ఎన్ని సమీక్షలు పెట్టినా క్షేత్రస్థాయిలో మాత్రం సమస్యలు తీరడంలేదు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంత మైనా.. వాటిని తరలించే ప్రక్రియ మాత్రం నెమ్మదించింది. దీంతో కాంటాలు వేసిన ధాన్యం బస్తాలు ఎక్కడికక్కడే దర్శనమిస్తున్నాయి. రైస్‌మిల్లులకు తరలించిన లారీలు సకాలంలో అన్‌లోడ్ కాక.. అక్కడే నిలిచిపోయాయి. దీంతో లారీల కొరత వేధిస్తుంది. నిజామాబాద్ మండలంలోని అమ్రాద్, మాక్లూర్ రెండు సొసైటీల పరిధిలో, వెంకటాపూర్ గ్రామాల్లో ఐకేపి అధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అమ్రాద్ సొసైటీ పరిధిలో ఏడు గ్రామాల్లో 9 కాంటాలను ఏర్పాటు చేశారు. 25 వేల బస్తాలు వరకు కాంటా వేసిన బస్తాలు ఉన్నాయి. మాక్లూర్ పరిధిలోని 28 గ్రామాల పరిధిలో 35 కాంటాలు ఏర్పాటు చేశారు. 10 వేల బస్తాలు తరలించేందుకు సిద్ధంగా ఉన్నాయి. మాక్లూర్ సొసైటీకి 10 లారీలు, అమ్రాద్ సొసైటీకి నాలుగు లారీలు కేటాయించారు. అయితే రైస్‌మిల్లుకు వెళ్లిన లారీలు నాలుగైదు రోజుల పాటు రైస్‌మిల్లుల వద్ద ఉంటున్నాయి.

సకాలంలో ధాన్యం బస్తాలు రైస్‌మిల్‌కు తరలించడానికి లారీలు రాక పోవడంతో కేవలం రెండు సొసైటీల పరిధిలోనే సుమారు 40 వేల బస్తాలు రోడ్లపై, కల్లాల్లోనే నిలిచి ఉన్నాయి. ఇంకా కాంటా కావాల్సినవి సుమారు 38 వేల బస్తాల వరకు ఉన్నట్టు సమాచారం. అయితే ధాన్యం తరలించిన లారీలు రైస్‌మిల్లుల వద్ద సకాలంలో అన్‌లోడ్ కాకపోవడంతో అక్కడే నిలిచిపోతున్నాయి. ఆ ప్రభావం ధాన్యం తరలింపుపై తీవ్రంగా పడుతుంది. ప్రతేడాదీ ఇదే తంతు కొనసాగుతున్నా.. అధికారుల తీరు మాత్రం మారడం లేదు. సమీక్షలు నిర్వహిస్తున్నా క్షేత్రస్థాయిలో రైతులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు.

ఎక్కువ డబ్బులు వెచ్చించి..

లారీ డ్రైవర్‌కు ఎవ్వరు డబ్బులు ఇస్తే వారి బస్తాలు లారీలలోకి ఎక్కించుకుంటున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. బస్తాకు రూ. 4 నుంచి రూ. 6 వరకు తీసుకుంటున్నారు. హమాలీలు బస్తాకు రూ 15 చొప్పున సొసైటీ వారు తీసుకుంటారు. పలుచోట్ల రైతులే లారీలు మాట్లాడుకుంటుండగా.. ఎక్కువ డబ్బులు వెచ్చించాల్సి వస్తుంది. అధికారులు చర్యలు తీసుకొని రైస్‌మిల్లుల్లో ధాన్యం సకాలంలో అన్‌లోడింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పది రోజులు అవుతున్న లారీ రావడం లేదు

రవి నాయక్, అమ్రాద్ తండా వాసి

నాలుగున్నర ఎకరాలు వరి ధాన్యం సాగు చేశాను. ధాన్యం కాంటా అయి పది రోజులు అవుతున్నా లారీ ఎక్కించడం లేదు. తండా వైపు లారీలు పంపడం లేదు. లారీ డ్రైవర్ కు రూ. 4, హమాలీ రూ. 18 తీసుకుంటున్నారు. అయినా కూడా సమయానికి లారీలు పంపడం లేదు. రైతులను దోచుకోవడానికి సొసైటీ ఉంది అన్నచందంగా ఉంది. సకాలంలో లారీలను పంపి ధాన్యం బస్తాలు పంపాలి. మళ్లీ వర్షం కురిస్తే తీవ్రంగా నష్టపోతాం.

లారీలకు అధిక డబ్బులు ఇవ్వొద్దు

గంగారాం, సొసైటీ సీఈవో

రైతులు తమ బస్తాలను త్వరకు రైస్ మిల్లులకు పంపాలనే లారీలను వారే మాట్లాడుకొని బస్తాకు కొంత డబ్బులు ఇస్తామని చెప్పి ధాన్యం బస్తాలు తరలించుకుంటున్నారు. కొందరు అలా చేయడం వల్ల అందరిపై అదే భారం పడుతుంది. లారీల కొరత తీర్చేందుకు కృషి చేస్తున్నాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

మండుటెండలో పచ్చతోరణం

- ఆహ్లాదపరుస్తున్న కొప్పర్తి క్యాంప్ రహదారి

నవతెలంగాణ-బోధన్



సాలూర మండలం కొప్పర్తి క్యాంప్ రహదారి వెంట ఉన్న చెట్లు గ్రామంలో వెళ్తున్నప్పుడు రోడ్డుకిరువైపుల పచ్చని తోరణంలా స్వాగతిస్తున్నట్లు ఆహ్లాద పరుస్తున్నాయి. గతంలో హరితహారంలో రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటడంతో ప్రస్తుతం అవి చెట్లుగా పెరిగి పాదాచారులకు చల్లని నీడనిస్తు న్నాయని సర్పంచ్ బొల్లెపల్లి సుశీల తెలిపారు. మండు వేసవిలో సైతం పచ్చదనం కనువిందు చేస్తున్నట్టు వాహనదారులు పేర్కొంటున్నారు. పలువురు వాటి కింద సేద తీరుతున్నారు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

- 23న గ్రామపంచాయతీ జేపీసీ జిల్లా సదస్సును జయప్రదం చేయండి : సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ-కంఠేశ్వర్



గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచి మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, రాష్ట్ర జేఏసీ కన్వీనర్ దాసు (ఐఎఫ్‌టియు) కోరారు. గ్రామపంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 23న నిజామాబాద్ నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా సదస్సు ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నా మని, పంచాయతీ సిబ్బంది హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ రాష్ట్రంలో 12,769 గ్రామపంచాయతీలో సుమారు 50 వేల మంది పనిచేస్తున్నారని, అనేక సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో వెట్టి చాకిరి చేసిన విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టిలో పెట్టుకొని వెంటనే జీవో నెంబర్ 60 ప్రకారం 19 వేల రూపాయలు వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మే డే సందర్భంగా వెయ్యి రూపాయల వేతనం పెంచినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారని అన్నారు. జీవో నెంబర్ 51 సవరించాలని మల్టీ పర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని వివిధ కేటగిరీలన్నిటిని యధావిధంగా కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలనిచ విధి నిర్వహణలో మరణించిన సిబ్బందికి 10 లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వమే ఇవ్వాలని, ఎనిమిది గంటల పని విధానం కొనసాగించాలని, కార్మిక, సిబ్బందిని అక్రమంగా తొలగించడం, వేధించడం వెంటనే ఆపాలని ప్రభుత్వాన్ని కోరారు. పంచాయతీలో నియమించిన కార్మికులందరికీ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి కాజా మొయినుద్దీన్, తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేపీ గంగాధర్, ఇందూరు రాజయ్య సీఐటీయూ నాయకులు జంగం గంగాధర్, సాగర్, గంగారాం పాల్గొన్నారు.

తరుగు పేరిట ధాన్యం దించుకోవట్లే

- రైస్‌మిల్ ఎదుట రైతు ధర్నా
- ఎమ్మెల్యే స్పందించి ఆదుకోవాలని డిమాండ్


ధర్నా చేపట్టిన రైతులు, రైతు నాయకులు

నవతెలంగాణ-బోధన్

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిన విషయం తెలిసింది. దీంతో ప్రభుత్వం ముందుకు వచ్చి తడిచిపోయి రంగు మారినా, మొలకలు వచ్చిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని చెప్పింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. అయితే పలు రైస్‌మిల్లర్లు మాత్రం రైతులకు కొర్రీలు పెడుతూనే ఉన్నారు. తరుగు పేరిట ధాన్యం అన్‌లోడ్ చేసుకోవడం లేదు. దీంతో నిజామాబాద్ జిల్లా సాలూర మండల కేంద్రంలోని తిరుమల రైస్‌మిల్ ఎదుట రైతులు ఆదివారం ఆందోళన చేపట్టారు.

వివరాలు మెయిన్‌లో..

అగ్నిగుండం



- నిజామాబాద్‌లో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- కామారెడ్డిలో 43.8గా నమోదు
- రోజురోజుకూ ముదురుతున్న ఎండలు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నిజామాబాద్ జిల్లాలో భానుడు భగభగలాడుతున్నాడు. ఈ సీజన్‌లోనే అత్యధికంగా ఆదివారం 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. భానుడి ప్రతాపంతో రోడ్లన్నీ బోసిపోతున్నాయి. మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఇక కామారెడ్డి జిల్లాలోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. ఆ జిల్లాలో 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఈ సీజన్‌లోనే ఇదే అత్యధికంగా నమోదవడం గమనార్హం. ఇక భానుడి భగభగతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. సిరికొండ, భీంగల్, వేల్పూర్, నిజామాబాద్ నార్త్, రూరల్, సౌత్, మోపాల్ తదితర మండలాల్లో నీరు ప్రమాదకరస్థాయిలో అడుగంటింది. మరో వారం రోజుల పాటు ఇదే విధంగా ఎండలు దంచికొట్టనున్నాయి.

అకాల వర్షాలతో మే మొదటివారం వరకు భానుడి భగభగల నుంచి ఉపశమనం కలిగిన జిల్లావాసులకు... ప్రస్తుతం ముచ్చెమటలు పడుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచే ఎండలు ముదురుతున్నాయి. దీంతో ఉదయం 11 గంటల నుంచి రోడ్లపై జన సంచారం తగ్గుతోంది. నిజామాబాద్‌లో మే మొదటివారం వరకు కొంత ఉపశమనం కలిగినప్పటికీ.. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదవుతున్నాయి. కరీంనగర్, జగిత్యాల తరువాత నిజామాబాద్‌లోనే అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం ఏకంగా 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఇది ఈ సీజన్‌లోనే అత్యధికం. భానుడి భగభగతో జనం అల్లాడుతున్నారు. ఏసీ, కూలర్ల వద్ద సేదతీరుతున్నారు. మే 10వ తేదీ వరకు జిల్లాలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత దాటలేదు. కానీ ఇప్పుడు ఏకంగా 45 డిగ్రీల వరకు నమోదు కావడం గమనార్హం. మరో మూడు రోజుల పాటు ఇదే విధంగా ఎండలు దంచికొట్టనున్నాయి. నిజామాబాద్‌తో పాటు కామారెడ్డిలోనూ భానుడు భగభగలాడుతున్నాడు. ఆ జిల్లాలో ఈ సీజన్‌లోనే అత్యధికంగా 43.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయ్యింది. మరో మూడు రోజుల పాటు ఇదే విధంగా 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నట్టు వాతావరణ శాఖ అంచనా వేసింది.


నిర్మానుష్యంగా మారిన బస్టాండ్-రైల్వే స్టేషన్ రోడ్డు

జాగ్రత్తలు తప్పనిసరి..

సాధారణంగా 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయితే ఆ ప్రాంత ప్రజలకు అధికారిక యంత్రాంగం హెచ్చరికలు జారీ చేయాల్సి ఉంటుంది. సిగ్నళ్ల దగ్గర టెంట్లు వేయడం, అంబలి, తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేయడం చేయాలి. అలాగే మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా అప్రమత్తం చేయాలి. ఓఆర్ఎస్ ప్యాకేట్లు పంపిణీ చేయాలి. వడదెబ్బ బాధితులకు సత్వర వైద్యం అందే విధంగా అన్నీ పీహెచ్‌సిలల్లో ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో నమోదవుతున్న అత్యధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్దులు, పిల్లలు వడదెబ్బ ప్రమాదబారిన పడకుండా ఇంటిపట్టున ఉండాలని సూచిస్తున్నారు. దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు సైతం జాగ్రత్తలు వహించాలని సూచిస్తున్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు..

జిల్లాలో ఎండలు ముదరడం, అధిక నీటి వినియోగం వల్ల భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. గతేడాది ఏప్రిల్ మాసంతో పోల్చితే ఈ యేడాది మూడు నుంచి నాలుగు మీటర్ల లోతుకు నీరు అడుగంటింది. అయితే ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాల వల్ల కొన్ని ప్రాంతాల్లో నీరు పైకి కూడా వచ్చింది. కానీ ప్రస్తుతం మే నెలలో ఎండలు ముదరడంతో మరింత లోతుకు నీరు అడుగంటే ప్రమాదముందని భూగర్భజల శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవికాలంలో నీటి ఎద్దడి రాకుండా నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచిస్తున్నారు. భీంగల్‌లో గతేడాది 8,92 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు ఉండగా.. ఈ యేడాది అదతి 16.25 మీటర్ల లోతుకు చేరింది. గొన్‌గొప్పులలో గత నెలలో27 మీటర్ల లోతుకు నీరు ఉండగా.. ప్రస్తుతం 30.05 మీటర్ల లోతుకు చేరింది. మాక్లూర్‌లో గత నెలతో పోల్చితే 2 మీటర్ల లోతుకు నీరు అడుగంటింది. మోపాల్, మోర్తాడ్, నిజామాబాద్ సౌత్ శివాజీనగర్, గడ్కోల్, రామన్నపేట(వేల్పూర్) తదితర ప్రాంతాల్లో రెండు మీటర్ల లోతుకు నీరు చేరింది.

అనాథకు ఆర్థిక సాయం


పదివేల ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-భిక్కనూర్

అనాథ మహిళకు ఆదివారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసి విప్ గంప గోవర్ధన్ అండగా నిలిచారు. మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన అనాథ మహిళకు పదివేల రూపాయలు పంపించారు. వాటిని స్థానిక నాయకులు ఆమెకు అందజేశారు. గ్రామానికి చెందిన మన్నెమ్మ భర్త చనిపోయి అనాథగా జీవిస్తున్నారు. ఇటీవల గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే గోవర్ధన్ దృష్టికి ఆమె పరిస్థితిని స్థానిక నాయకులు వివరించగా తక్షణమే స్పందించిన ఆమె కుటుంబాన్ని ఆదుకుంటానని ఆమెకు 10,000 రూపాయలు పంపించారు. ప్రభుత్వం పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సులోచన సుదర్శన్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ లింగాల కృష్ణ గౌడ్, ఉప సర్పంచ్ సిద్ధా గౌడ్, మండల కోఆప్షన్ సభ్యురాలు సుల్తానా, వీరేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ బాపురెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్, గ్రామ అధికార పార్టీ అధ్యక్షులు బాలకిషన్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఆకుతోట భాగ్య, సొసైటీ డైరెక్టర్ రాజసింహారెడ్డి, మాజీ సర్పంచ్ భూపతి, నాయకులు జీవన్ రెడ్డి, మురళి, నీలం రెడ్డి, మల్లారెడ్డి, రాములు, శివానందం గౌడ్, సిద్ధిరాములు, రాజిరెడ్డి, రామస్వామి, రాజవ్వ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-ఏర్గట్ల



మండలకేంద్రంలోని పాతహనుమాన్ వద్ద పెద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆలయానికి చెందిన పెద్దలు దేవుని పుట్టినరోజు వేడుకలను జరిపి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పిట్ల నరేష్, కండక్టర్ శ్రీనివాస్, పిట్ల మధుకర్, బొచ్చు సురేష్, బొచ్చు ప్రశాంత్, పిట్ల గణేష్, భక్తులు పాల్గొన్నారు.

చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపనకు విరాళం

నవతెలంగాణ-ఎడపల్లి



చత్రపతి శివాజీ మహారాజ్ వారసుడు చత్రపతి సాంబాజి మహారాజ్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపనకు మండల కేంద్రానికి చెందిన కందగట్ల అంబయ్య 55,770 రూపాయల విరాళాన్ని ఎంపీపీ కే శ్రీనివాస్, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎడపల్లి ఎంపిటిసి షేక్ జావిద్ బాబా , కందగట్ల రామచందర్, మల్లెపూల శ్రీనివాస్, సిరిశెట్టి సంతోష్, ప్రవీణ్, గ్రామ యువకులు ఉన్నారు.

నాణ్యత.. నీ చిరునామా ఎక్కడ?

- పాఠశాల చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ
- నాణ్యతను పట్టించుకునే దెవరు?
- చూసీచూడనట్లు అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పాఠశాల చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండానే పనులను చేసేస్తున్నారు. ప్రతి రోజు పర్యవేక్షించే అధికారులు ఆ వంక చూసీచూడనట్లు వ్యవహరించడంతో నాణ్యత కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధకారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్లకు కాసులు కురిపిస్తున్నాయి. ఓ ప్రణాళిక అంటూ లేకుండా తమ ఇష్టానుసారంగా పనులు చేస్తూ పనైతే పుర్తి చేశామని డబ్బులు తీసుకుంటున్నారు. నిధులు మంజూరైన వెంటనే ప్రజాప్రతినిధులు కమీషన్ల రూపంలో తమకు ఎంత ముట్టజేప్తరనే విషయమై పలువురు కాంట్రాక్టర్లకు ఏరికోరి పనులను అప్పగించి తమ జేబులు నింపుకోవడమే పరమావధిగా మారిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి పర్యవేక్షణ చేసే అదికారులు సైతం పచ్చ జెండా ఊపడం.. ఆఘమేఘాల మీద ఎంబిలు చేయడం చక చక జరిగిపోతూనే ఉన్నాయి. నిర్మిస్తున్న ప్రహరీలో ఇటుకలు ఇప్పుడే ఊడుతున్నాయని, సిమెంట్ కుడా సరిగా వాడటం లేదని అంటున్నారు. ఇదేనా పనులు చేసే తీరని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందల్‌వాయి మండలంలోని ఇందల్‌వాయి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పనులే ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచాయి."మన ఊరు మన బడి' పథకం కింద ఇందల్ వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైంది. దీనికి దాదాపు రూపాయలు 80 లక్షలు మంజూరైన ప్రహరీ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను చేపట్టారు. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం రూ.33 లక్షలు, మైదానం చదును ఇతర పనులు చేస్తున్నారు.



నాణ్యతలేని నిర్మాణం

మరుగుదొడ్లు, మూత్రశాలలు వృథానేనా?

2017-18లో లక్షల రూపాయలతో బాలబాలికలకు వేర్వేరుగా నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశా లలు వృథాగా మారనున్నాయి. అనాడు ఖాళీ స్థలం ఉండటం, ప్రహరీ లేకపోవడంతో పనులను కానిచ్చారు. ఇప్పుడు చేసే పని అదికారులు దగ్గర ఉండి మైదానంలో ఎంత మేర మొరం వేయాలి, అనాడు నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశాలలకు ఉపయోగించే విధంగా ఒక ప్రణాళిక ప్రకారం చేయాల్సి ఉండగా ఎక్కడా అమలైన దాఖలాలు కనబడటంలేదు. మైదానం మొత్తంలో నలువైపులా మొరం వేయడంతో మరుగుదొడ్లు, మూత్రశాలలు సగం వరకు మునిగిపోయి వినియోగానికి పనికి రాకుండాపోయాయి. అధికారుల ప్రణాళిక లోపంతో ప్రజాధనం వృథాగా మారిపోయింది. ఇది గమనించిన గ్రామస్తులు జరుగుతున్న పనులపై ఆగ్రహం వ్యక్తం చేస్తు నిర్మించిన ప్రహరీలో నాణ్యత లోపం ఉందని, ఇప్పుడే ఇటుకలు ఊడిపోతున్నాయని, వాటిని తొలగించి నాణ్యతతో కూడిన పనులను చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

నిబంధనలకు తూట్లు...

ప్రభుత్వం మంజూరు చేసే ఏదైనా పనిలో నియమ నిబంధనలు పాటించి పనులు చేయాల్సి ఉండగా నాణ్యత లేని ఇసుక, మొరం, కంకర, స్టీల్, సిమెంట్ ఇతరత్రా వాటన్నింటిని పక్కకు పెట్టి నాణ్యతా ప్రమాణాలు లేని ఇసుకను తక్కువ ధరకు లభించే వాటికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజాధనంను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో సిమెంట్ తక్కువగా వినియోగి స్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. ఇలాంటి నాణ్యతలేని పనులు చేపట్టడంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని, ప్రభుత్వం అభివృద్ధి పనులకోసం లక్షల కోట్లు మంజూరు చేస్తున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు కొరవడి, అధికారుల పర్యవేక్షణ లోపంతో కొందరు కాంట్రాక్టర్లకు తాము ఆడిందే అటగ పాడిందే పాటగా మారి జేబులు నింపుకుంటున్నారు. నిధులు లేక చాలాచోట్ల వసతులు మృగ్యమవుతుంటే.. ఇక్కడేమో ఇలా సర్కారు సొమ్మును వృథా చేయడంపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అధికారుల నిర్లక్ష్యం, జిల్లా యంత్రాంగం పర్యవే క్షణ లోపం, ప్రజాప్రతినిధుల అలసత్వంతో పనుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

ప్రభుత్వ పని ఏదైనా అంతే

సీసీ, బీటీ రహదారులు, డ్రైనేజ్, కమ్యూనిటీ భవన నిర్మాణాలు, ఇతరత్రా అభివృద్ధి పనులు నిర్మాణాలవల్ల పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాకుండనే పనులను పూర్తి చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఏ గ్రామంలో చూసిన లక్షలు, కోట్లా రూపాయలను ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యకమాలకు నిధులను మంజూరు చేస్తుంది. ఒక కాంట్రాక్టర్, ఇంకో పక్క ప్రజా ప్రతినిధులు పనులను చేపట్టడంతో



నాణ్యత లోపంతోనిర్మించిన ప్రహరీ



సిమెంట్ సరిగావేయకుండా చేపట్టిన నిర్మాణం

నాణ్యత కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్దేశం బాగున్నా క్షేత్ర స్థాయిలో జిల్లా, మండల అధికారుల పర్యవేక్షణ లోపంతోనే పనులు పూర్తి చేస్తున్నారనే వాదనలు లేకపోలేదు.

పనులను పరిశీలిస్త

రాములునాయక్, ఎంపీడీవో

మన ఊరు- మన బడి పనుల్లో నాణ్యత లోపం నా దృష్టికి రాలేదు. సంబంధిత శాఖ ఏఈ తో క్షేత్రస్థాయిలో పనులను పరిశీలిస్త.

17న కలెక్టరేట్ ముట్టడి

- యాదవ కురుమ సంఘాల జేఏసీ

నవతెలంగాణ-ఆర్మూర్

యాదవ కురుమలను వారి కులవృత్తిని కించపరుస్తూ యాదవ సామాజికగవర్గ మంత్రివర్యులుశ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి వెంటనే యావత్ యాదవ కురుమ సామాజిక వర్గానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న జిల్లా కలెక్టరేట్ ముట్టడి చేస్తామని యాదవ కురుమ జేఏసీ సభ్యులు అన్నారు పట్టణంలో యాదవ కురుమల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రెస్ మీట్ లో యాదవ కురుమలు మాట్లాడారు. ఒక జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగాఉన్న రేవంత్ రెడ్డి అగ్రకుల అహంకారంతో యాదవ కురుమ జాతిని వారి వృత్తిని పెండ పిసికే జాతి అని యాదవ కురుమలను అవమానపరచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని యావత్ యాదవ కురుమలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు లేకపోతే ఈనెల 17నుండి 21వరకు జిల్లా కేంద్రాల్లో " నిరసన ర్యాలీలు ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. ఈనెల 24అర్ధరాత్రి వరకు క్షమాపణ చెప్పకుంటే 25న గాంధీ భవన్ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీయాదవ కురుమ నాయకులు భూస రాజన్న యాదవ్, జక్కుల రాజేందర్ యాదవ్, పెద్దలు బాబురావు, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సౌకర్యం కోసమే రూ.5 భోజనం

నిరుపేదలకు భోజనం అందిస్తున్న మున్సిపల్ చైర్మెన్



ఐదురూపాయల భోజనం ప్రారంభిస్తున్న తూము రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలో ప్రతినిత్యం ఆసుపత్రులకు వైద్యం కోసం వచ్చే నిరుపేద రోగుల కోసం, వారి సహాయకుల కోసం వచ్చే వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతోనే రూ. 5లకు భోజన సౌకర్యం ఏర్పాటుచేసినట్లు బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతి, కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి దంపతులు అన్నారు. అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని తూము శివమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కౌన్సిలర్ శరత్‌రెడ్డి ఏర్పాటుచేసిన 5రూపాయల భోజనం ఆదివారం బోధన్ పట్టణంలోని సరస్వతి నగర్‌లో తూము రవీందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్నం పరబ్రహ్మ స్వరూపం కనుక నిరుపేదలకు భోజన సౌకర్యం అందించాలనే ఉద్దేశంతో 5రూపాయలకు భోజనం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని, తన తల్లి పేరుతో ఏర్పాటుచేసిన తూము శివమ్మ మెమోరియల్ ట్రస్ట్ పేరుతో నిరుపేదలకు సేవాకార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఈ ట్రస్టు ద్వారా తమ సేవలు విస్తరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వినోద్, శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా క్రీడాకారులకు రక్షణ కల్పించాలి

నేడు దేశవ్యాప్త ఆందోళన : ఐఎఫ్‌టీయూ



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మహిళ క్రీడాకారులకు రక్షణ కల్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసు అన్నారు. ఢిల్లీలో మహిళా మల్ల యోధులు చేస్తున్న న్యాయపోరాటానికి మద్దతుగా సోమవారం ఆందోళన చేయాలని జాతీయ కమిటీ పిలుపునిచ్చిందని తెలిపారు. నిజామాబాద్ నగరంలోని కొటగల్లిలోని నీలం రామచంద్రయ్య భవన్లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ పోటీల్లో పతకాలను సాధించిన మహిళ మల్లయోధులను (రెజ్లర్లను), రెజ్లింగ్ ఆఫ్ ఇండియా ఫెడరేషన్ అధ్యక్షులు, లోక్ సభ సభ్యుడు అయినా బ్రిజ్ భూషణ్ సింగ్, లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఫిర్యాదులు చేసి, ఆందోళన చేస్తే కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతి యుతంగా నిరసన తెలుపుతున్న మహిళా రెజ్లర్లపై ఈనెల 3 రాత్రి పోలీసులు దురుసుగా ప్రవర్తించడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. లోక్ సభ సభ్యుడైన బ్రిజ్భూషన్ పై చర్య తీసుకోకుండా బాధితులపైనే పోలీసులు విరుచకపడడం, బిజెపి ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేస్తుందని ఆయన అన్నారు. బీజేపీ ప్రభుత్వం నేరస్తులకు అండగా నిలవడం సిగ్గుచేటన్నారు. మహిళా రెజ్లర్లకు ప్రజల నుండి వస్తున్న సానుభూతి, మద్దతుకు భయపడి ఎఫ్ఐఆర్ నమోదు చేసి కూడా ఆయనపై చర్య తీసుకోకపోవడం దుర్మార్గమని ఆయన అన్నారు. బేటిబచావో బేటి పడావో అనే మోడీ మాటలు నీళ్ల మూటలేననీ నిర్ధారణ అయిందని తెలిపారు. బాధితుల్లో మైనర్లు ఉండటం వల్ల వెంటనే పోక్సో చట్టం కింద నిందితుడిని అరెస్టు చేసి...సమగ్ర దర్యాప్తు చేసి నేరస్తులను కఠినంగా శిక్షించాలన్నారు. ఆందోళనలో పాల్గొనాలని మహిళా కార్మికులకు ప్రత్యేకంగా కోరారు. సమావేశంలో ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు జేల్లా మురళి, ఎండి కాజా మొయినద్దీన్, కార్యదర్శి శివకుమార్, జేపీ గంగాధర్, రాజు, ఎల్లప్ప బాపు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

గాండ్ల తేలికుల వధూవరుల పరిచయ వేదికను జయప్రదం చేయండి

- వధూవరుల పరిచయ వేదిక కార్యనిర్వాహక కమిటీ



వధూవరుల పరిచయ వేదిక కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర గాండ్ల తేలికుల వివాహ వధూవరుల పరిచయ వేదికను కుల బంధువులందరూ సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని వధూవరుల పరిచయ వేదిక కార్య నిర్వాహ కమిటీ ప్రధాన కార్యదర్శి గంగోల్ల ప్రళయ్ తేజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈనెల 28న నిర్మల్ జిల్లా బాసరలో ఈ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గాండ్ల తేలికుల రాష్ట్రీయ పరిచయ వేదికకు ముఖ్య అతిథులుగా ఉత్తరప్రదేశ్ పట్టణ శాఖ మంత్రి రాకేష్ రాథోర్ గురు, పార్లమెంట్ సభ్యులు సంఘములాల్ గుప్తా, మాజీ శాసన సభ్యులు రాంసింగ్ సాహు, మగ్గిడి గోపాల్ గాండ్ల, ఆల్ ఇండియా గాండ్ల తెలీకుల సంఘం అధ్యక్షులు ఉమేష్ నందలాల్ సాహు, ప్రధాన కార్యదర్శి సునీల్ సాహు, గాండ్ల తెలీకుల తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ పాల్గొంటారని తెలిపారు. ఈ పరిచయ వేదికను గాండ్ల తేలికుల కుల బంధువులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వధూవరుల పరిచయ వేదికకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వధూవరుల పరిచయ వేదిక రాష్ట్ర అధికార ప్రతినిధి బోడగొడ్డు కమలకర్, గాండ్ల సంఘం మండల అధ్యక్షుడు గాండ్ల రాజ్ కుమార్, కార్యదర్శి సుంకాజి రవి రాజ్, కోశాధికారి సందరి రవీందర్, ప్రధాన సలహాదారులు గాండ్ల శ్రీనివాస్, గాండ్ల శివ, గాండ్ల సాంబయ్య గాండ్ల రాములు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లోనే పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలి : యూటీఎఫ్

నవతెలంగాణ-భీమ్‌గల్

పాఠశాలల పునఃప్రారంభం లోపు ఉపాధ్యాయుల పదోన్నతులు నిర్వహించి, నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని టిఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్క జనార్దన్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీల ప్రభుత్వ ఉత్తర్వులపై హైకోర్టులో స్టే కొనసాగుతున్నందున మొత్తం ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. పదోన్నతులు, నియామకాల ద్వారానే ఖాళీ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు బదిలీలపై హైకోర్టు తీర్పు వచ్చేలోగా తాత్కాలిక ప్రాతిపదికన పదోన్నతులు చేపట్టాలని, తద్వారా ఏర్పడిన ఖాళీల్లో నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

హామీలను అమలు చేయాలి : వీవోఏలు

21వ రోజుకు సమ్మె

నవతెలంగాణ-డిచ్‌పల్లి/ఎడపల్లి

వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయించడంలో అహర్నిశలు శ్రమిస్తామని ఇప్పటికైనా ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ వివోఏ ఇందల్ వాయి మండల అధ్యక్షురాలు కె సరళ, ప్రధాన కార్యదర్శి కె రాము అన్నారు. తమ డిమాండ్ల సాధనకు చేపట్టిన సమ్మె ఆదివారం 21వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకేపీ వీఓఏలకు ప్రభుత్వం భరోసా కల్పించడంలో మీనమేశాలు లెక్కిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ ఉద్యోగులకు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో సమ్మె చేయక తప్పడం లేదన్నారు. గతంలో నిరసనలు, సమ్మెలు చేసినప్పుడు ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లామని తెలిపారు. అనాడు సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చి నేటి వరకు ఇచ్చిన హామీ నేరవేరలేదని వారు వాపోయారు. ఇప్పటికైనా వీవోఏల సమస్యలను సానుకుల దృక్పథంతో పరిష్కరించా లని ప్రభుత్వాన్ని కోరారు. కనీస వేతనాలు నెలకు రూ.18 వేలు, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ప్రమాద బీమా సౌకర్యం, అర్హులైన వారందరికీ సీసీలుగా నియమించాలని, యూనిఫామ్ కేటాయించాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ. 10 లక్షల కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని వారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సువర్ణ, కోశాధికారి మమత, సభ్యులు కవిత, సౌమ్య, అరుణ, స్వప్న, అలేఖ్య, రాధిక, లావణ్య భాగ్య, మౌనిక పాల్గొన్నారు.



డిచ్‌పల్లిలో..



ఎడపల్లిలో..

ఎడపల్లి : మండల కేంద్రంలోవీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మెలో వీవోఏలకు కనీస వేతనం 20వేల రూపాయలు గౌరవ వేతనాన్ని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో పాటు స్త్రీ నిధి నుండి అత్యవసర సమయంలో 50 వేల రూపాయలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి డిమాండ్లను అమలు చేయాలని వారు కోరారు. పోచయ్య, సుదర్శన్, శోభ, మంజుల, లత, సమ్మెలో కూర్చున్నారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి

విద్యారంగ సమస్యలపై నిరంతరం ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి తెలిపారు. ఆదివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు, డొనేషన్లు వసూలు చేస్తే ఎస్ఎఫ్ఐగా ఉద్యమాలు ఉద్రిక్తం చేస్తామని హెచ్చరించారు. అడ్మిషన్ కోసం టెస్టులు పెట్టడం కూడ నిబంధనలకు విరుద్ధమని అన్నారు. వీటితోపాటు ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలకు ముందస్తుగా పాఠ్యపుస్తకాలు యూనిఫామ్ అందించాలని, మధ్యాహ్న భోజన చార్జీలను పెంచి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి విద్యా సంవత్సరం ప్రారంభానికి ఎటువంటి సమస్యలు లేకుండా సాఫీగా సాగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. హాస్టళ్లకు పెంచిన మెస్‌ఛార్జీలు అమలు అయ్యే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బోడ. అనిల్, జిల్లా ఉపాధ్యక్షులు మహేష్ , నాగరాజ్, సహాయ కార్యదర్శి దిపిక, జిల్లా నాయకులు జోహర్సింగ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం పట్ల సంబురాలు

నవతెలంగాణ-ఎడపల్లి



కర్ణాటకలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించడంపట్ల ఎడపల్లి, జానకంపేట గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సంబరాలు నిర్వహించారు. బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి సూచన మేరకు ఎడపల్లిలో మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు, నాగనూర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందుగా డప్పు వాయిద్యాలతో నాయకులు పార్టీ కార్యకర్తలు నృత్యాలు చేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. జానకంపేటలో కమ్మరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో టపాసులు, బాణాసంచాలు పేల్చి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించి తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎడపల్లి మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు మాట్లాడారు. కర్ణాటక ప్రజలు కుల మతతత్వ పార్టీలకు, అవినీతిపరులకు తగిన తీర్పునిచ్చారని కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఏఐసీసీ జాతీయ అధినేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఎంతో పని చేసిందని ఆయన గుర్తు చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్‌పార్టీ విజయం చూస్తే రానున్న ఎన్నికల్లో కూడా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేకేసి జిల్లా చైర్మన్ భాస్కర్ రాజ్ ,డిస్ట్రిక్ట్ స్ట్రీట్ వెండర్ కాజా ఫయా జో దిన్, కేకేసి బోధన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ బుడ్డ పోశెట్టి, రాజశేఖర్, సున్నపు ఒడ్డెన్న, సరిదాస్ , ఫారన్, రత్నాకర్ ,బండ నవీన్, ఎర్ర శేఖర్, కమ్మరి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హసకొత్తూర్‌లో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండలంలోని హసకొత్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1996-97 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. 26వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్ద పూర్వ విద్యార్థులంతా ఒక చోట కలిసి ఆత్మీయ సమ్మేళనాన్ని వేడుకగా జరుపుకున్నారు. తమ అనుభవాలను, ప్రస్తుత ఉద్యోగ పరిస్థితులను ఒకరినొకరు అడిగి తెలుసుకుని ఆత్మీయతను పంచుకున్నారు. అందరూ కలిసి ఉన్నత పాఠశాలకు వెళ్లి తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు బోధించిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబు, పురుషోత్తం శర్మ, ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింబా గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రూప్ ఫోటోలు దిగి జ్ఞాపకాలను పదిలపరుచుకున్నారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన నిర్వాహకులు చిన్న సాయి, మురళి, గోపి చంద్రమోహన్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థులకు పురస్కారం

నవతెలంగాణ-భిక్కనూర్

కామారెడ్డి పట్టణ కేంద్రంలో మ్యాథ్స్ ఫైండర్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఇటీవల కాలంలో జిల్లాలోని ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్టులో మొదటి స్థానం సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారంతో పాటు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మ్యాథ్స్ ఫైండర్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు నాయిని జగదీష్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడానికి ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో సాందీపని విద్యాసంస్థల డైరెక్టర్ బాలాజి రావు, ఆర్యభట్ట కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ గౌడ్, సహేంధర్ నాథ్, తదితరులు పాల్గొన్నారు.

ముండ్ల పొదలు, చెత్త తొలగింపు

నవతెలంగాణ-రామారెడ్డి



అకాల వర్షాలతో గ్రామంలో పేరుకుపోయిన చెత్తాచెదారం, ముళ్ళ పొదలను ఆదివారం స్థానిక ఎంపిటిసి బొంపల్లి ఉమాదేవి దత్త్రాది జెసిబీ సహకారంతో గ్రామంలో పారిశుధ్య పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ఉమాదేవి దత్తాత్రికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

చెట్టుకు ఢీకొన్న బైక్

- ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-లింగంపేట్


భాను (ఫైల్)

ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన లింగంపేట్ మండలంలోని నాగారం వెళ్లే దారిలో నల్లమడుగు సమీపంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. లింగంపేట్ మండలంలోని నల్లమడుగు గ్రామానికి చెందిన జంగం భాను (25) హైదరాబాదులో పెట్రోల్ బంకులో పనిచేస్తున్నా. ఆదివారం స్వగ్రామానికి వచ్చేందుకు నల్లమడుగు చౌరస్తా వద్ద దిగారు. ఆటో సదుపాయం లేకపోవడంతో తన మిత్రుడు బైండ్ల వంశీకి ఫోన్ చేయగా.. వచ్చి తీసుకెళ్లాడు. నల్లమడుగు రోడ్డు మలుపు ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో జంగం భాను (25) అక్కడికక్కడే మృతి చెందాడు. బైండ్ల వంశీకి తీవ్ర గాయాలు కావడంతో అతన్ని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మృతునికి తండ్రి రాజు తల్లి విజయ ఉన్నారు.

అమృతలత- అపురూప పురస్కార ప్రదానోత్సవం


పురస్కారం అందుకున్న పలురంగాల ప్రముఖులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీలో 'అమృతలత- అపురూప పురస్కారాలు- 2023' ఆదివారం ఘనంగా జరిగాయి. సాహిత్యానికీ, ఇతర లలితకళలకూ దూరమవుతున్న యువతరాన్ని వాటిపట్ల ఆసక్తి, అనురక్తి కలిగించాలని, వివిధ రంగాల్లో విశేష కృషిచేసిన నిష్ణాతులైన స్త్రీ మూర్తులను గౌరవించాలన్న సదుద్దేశంతో ఈ అవార్డులను నెలకొల్పామని అమృతలత వివరించారు. అతిథులు, అవార్డు గ్రహీతలకు సంబంధించిన పరిచయాలతో కూడిన 'అభినందన' పుస్తకం అతిథులచే ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎడిటర్ డా.కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. అమృతలత జీవన సాఫల్య పురస్కారాల ప్రదాత డా. అమృతలత, అపురూప అవార్డ్స్ ప్రదాతలైన ఆమె కుటుంబ సభ్యులు అభినందనీయులని అన్నారు. విశిష్ఠ అతిథిగా విచ్చేసిన కేంద్రసాహిత్య సలహామండలి కన్వీనర్ డా.సి. మృణాళిని 'అమృతలత జీవన సాఫల్య' పురస్కారాలను అందజేశారు. 'నవలారచన' విభాగంలో గంటి భానుమతి, విద్యారంగంలో డా. పి. విజయలక్ష్మి పండిట్, 'సినీరంగం'లో సంగీత, శాస్త్రీయ సంగీతం'లో ద్వారం లక్ష్మి ఒక్కొక్కరూ ఇరవై ఐదువేల రూపాయలను చెక్కుల రూపంలో అందుకున్నారు. అపురూప' పురస్కారాలను మాణిక్యేశ్వరి (సినీ జర్నలిజం), ఆలపాటి లక్ష్మి (రంగస్థలం), మందరపు హైమవతి (కవిత్వం), మహెజబీన్ (మహిళాభ్యుదయం), జ్యోతి వలబోజు (పుస్తక ప్రచురణ), శైలజామిత్ర (సాహితీ విమర్శ), డా.కె.రత్నశ్రీ (శాస్త్రీయనృత్యం), డా.కె.యన్. మల్లీశ్వరి (కథారచన), పి.జ్యోతి (వ్యాసరచన) విభాగాలలో ఒక్కొక్కరూ పది వేల రూపాయలు అందుకున్నారు. మానసిక వికలాంగుడైన నాగదీప్ చేసిన నృత్యం, విజయ్ హైస్కూల్, నిజామాబాద్ ఉపాధ్యాయినీ బృందం చేసిన 'యమునా తీరమున నీలమోహన' నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది.

డాక్టర్ బోచ్కర్ ఓమ్‌ప్రకాశ్‌కు ఘన సన్మానం


సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

అవధాన విద్యా వికాస పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండవ అవధానశిక్షణా శిబిర విజయోత్సవ సభ హైదరాబాద్ పద్మారావు నగర్ లోని శివానంద ఆశ్రమంలో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జక్రాన్ పల్లి మండల కేంద్రానికి చెందిన పద్య కోకిల డాక్టర్ బోచ్కర్ ఓం ప్రకాష్ కు ఘన సన్మానం జరిగింది. కార్యక్రమంలో పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ ముఖ్యాతిథి గా పాల్గొన్నారు. విశిష్ఠ అతిథిగా ముఖ్యమంత్రి పిఆర్ఓ వనం జ్వాలా నరసింహారావు ఉభయ రాష్ట్రాలలోని అవధానులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా పద్య కోకిల అష్టావధాని డాక్టర్ బోచ్కర్ ఓమ్‌క్రాశ్ పాల్గొని తన మధుర పద్యాలాపనతో సభను రంజింపజేశారు. ముఖ్య అతిథి మేడసాని మోహన్ చేతుల మీదుగా ఓం ప్రకాశ్‌కు సన్మానం జరిగింది. వ్యవస్థాపక అధ్యక్షులు మరుమాముల దత్తాత్రేయ కార్యదర్శి కే వి ఎన్ ఆచార్య అనేకమంది కవి పండితులు పాల్గొన్నారు. అవధానాన్ని భావితరాలకు అందించడం కోసం ఈ శిక్షణ శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు

వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్


షేక్ అజ్మత్

నగరంలోని ఆరవ పోలీస్ స్టేషన్ పరిధిలో అదృశ్య కేసు నమోదు చేసినట్లు ఆరవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. ఎస్సై సాయి కుమార్ వివరాల ప్రకారం..ఈనెల 12న రాత్రి 11 గంటలకు సీఎం రోడ్, ఆటోనగర్ కు చెందిన షేక్ అజ్మత్ తన బామ్మర్దులతో గొడవపడి, ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అప్పటినుంచి తిరిగి రాలేదు. తన తమ్ముడు షేక్‌వాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆరవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయికుమార్ తెలిపారు.

పంట పశువుల పాలు.. రైతు అప్పుల పాలు



- వడగండ్ల వానకు పలువురి రైతులకు తీవ్ర నష్టం
- 60 వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్టు వ్యవసాయశాఖ నివేదిక
- సహాయం కోసం రైతుల ఎదురుచూపు

నవతెలంగాణ-లింగంపేట్

ఆరుగాలం కష్టపడి అప్పులు చేసి వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి యాసంగిలో సన్నా చిన్న కారు రైతులు బోరు బావుల వద్ద చెరువుగట్టు ప్రాంతాల్లో వరి పంట సాగు చేస్తే చివరకు పంట పశువుల పాలు అయిపోయింది. దీంతో రైతులు అప్పుల పాలయ్యారు. లక్షల రూపాయల నష్టం వాటిల్లింది. యాసంగిలోనైనా పంటలు బాగా పండి అప్పులు తీర్చుకోవాలని ఆశలు పెట్టుకున్న రైతులకు వారి ఆశలు నిరాశలయ్యాయి. ఇటీవల వడగండ్ల వాన కురవడంతో పలు చోట్ల పంటలకు పూర్తిగా నష్టం వాటిల్లింది. భారీ వడగండ్ల వానకు ఊర్లో గింజలు రాలి పంటలు లేకుండా పోయాయి. చివరకు పంట పశువుల పాలైపోయింది.

కామారెడ్డి జిల్లాలో 60 వేల ఎకరాలపై

గత నెలలో కురిసిన వడగండ్ల వర్షానికి కామారెడ్డి జిల్లాలో 60 వేల ఎకరాలపైగా పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. 30 వేల మంది రైతులకు నష్టం వాటిల్లిందని జిల్లా అధికారులకు ఇచ్చిన నివేదికలు పేర్కొన్నారు. జిల్లాలో లింగంపేట్, నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి, రామారెడ్డి, రాజంపేట్, మండలాల్లో ఈదురుగాలు వర్షం కురిసినప్పటికిని వడగండ్ల వాన లింగంపేట్, నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి మండలంలోని వడగండ్ల వాన అధికంగా పడడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అప్పుల పాలవుతున్నారు. లింగంపేట్ మండలంలోని బోనాల గ్రామంలోని 600 ఎకరాలు వరి పంట రైతు కండ్ల ముంగట వడగండ్ల వానకు పూర్తిగా నష్టం కావడంతో గ్రామంలో ఏ రైతును పలకరించిన రైతు కన్నీళ్లే కనిపిస్తున్నాయి.

బోనాల్‌లో 500 ఎకరాల్లో వడ్లు రాలి కర్రలే మిగిలాయి.


లింగంపేట్ మండలం బోనాల్‌లో వరి పంటను మేపుతున్న రైతు

కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలంలోని బోనాల గ్రామంలో గత నెల 25న కురిసిన వడగళ్ల వాన వరి పంటను తుడిచిపెట్టింది. కోతకు వచ్చిన వరి పంట వడగండ్ల వాన కారణంగా వడ్లన్నీ నేల రాలిపోయాయి. వరి కర్రలే మిగిలాయి. పంటలు రాగానే అప్పులు తీర్చి, ఆర్థిక అవసరాలను వెచ్చిద్దామనుకుంటే మరింత అప్పులలోకి కూరుకుపోయారు. వడగండ్ల వాన కారణంగా ఎటువైపు చూసిన వరి కర్రలే వందల ఎకరాల్లో దర్శనమిస్తున్నాయి.

500 ఎకరాల్లో ఉత్త వరి కర్రలే

లింగంపేట్ మండలంలోని బోనాల గ్రామంలో యాసంగిలో చిన్న సహకార రైతులు బోరు బావుల వద్ద చెరువు ఆయకట్టు ప్రాంతాల్లో వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి అప్పులు చేసి 600 పైగా ఎకరాలలో 490 మంది రైతులు వరి పంటలు సాగు చేశారు. ఒక్కొక్క రైతుకు ఆరెకరం నుండి మొదలుకొని ఆరు ఎకరాల వరకు వారి పంటను సాగు చేశారు. వరి చేతికి వచ్చిన సమయంలోనే ఏప్రిల్ నెలాఖరులో వడగండ్ల వాన కురవడంతో వందల ఎకరాల వరి గింజలు నేల రాలాయి. వట్టి వర్రీ కర్రలే మిగిలాయి. కేవలం 60 ఎకరాల్లోనే కోతలు పూర్తి కాగా, సుమారు 540 ఎకరాలు పూర్తిగా వడగండ్ల వాన కారణంగా వడ్లు రాలిపోవడంతో వందల ఎకరాలు వరి కర్రలే కనిపిస్తున్నాయి. ఒక గింజ లేకుండా రాలిపోయింది. మరికొన్ని వరి కర్రలకు గింజలు ఉన్నా చేసేదేమి లేక రైతు అప్పుల పాలై మానస వేదనకు గురి కావడంతో పొలం వైపు కన్నెత్తక చూడకపోవడంతో చివరకు పశువుల పాలైపోయింది. అదేవిధంగా కూరగాయల పంటలు, జొన్న మొక్కజొన్న కూరగాయలు చెరుకు పంటలు పూర్తిగా నేలమట్టమయింది. దీంతో లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది. చివరి అప్పులు మిగిలించింది. దీంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

మూడు కోట్ల పైగానే నష్టం

యాసంగిలో వరి పంట సాగుచేసిన రైతులకు మొదటి నుంచి కష్టాలే మొదలయ్యాయి. వరి పంట వేసిన నుండి వివిధ రకాల తెగులు రావడంతో తెగుళ్ల బారిన పడి రైతులు వేలాది రూపాయల అప్పులు చేశారు. ఒక ఎకరానికి రైతు 25 నుంచి 27 వేల రూపాయలు ఖర్చు చేయగా వడగండ్ల వాన లేకుంటే ఎకరా 25 కింటాలు ధాన్యం వచ్చేది. గ్రామంలోని 494 మంది రైతులు యాసంగిలో సుమారుగా ఒక కోటి 50 లక్షలు ఖర్చు చేశారు. చేసినప్పుడు పెట్టుబడి పోను లాభం ఆశించిన రైతులకు నిరాశ కలిగింది. పిల్లల చదువులు పెళ్లికొచ్చిన కూతురు పెళ్లిలో పెట్టుబడి తీసుకొచ్చినప్పుడు కట్టలేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. బోనాల గ్రామం శివారులో ఎటువైపు చూసిన వందల ఎకరాల్లో వరి కర్రలు కంటి చూపు మేరకు దర్శనమిస్తున్నాయి. దీంతో రైతులు చేసేదేమీ లేక చివరకు మేతకు వినియోగిస్తున్నారు. మరికొన్ని పశువులు వడగండ్ల వాన కారణంగా వరికల్లో కర్రలు వాసన రావడంతో పశువుల సైతం మేతమేయలేకపోతున్నాయి.

పరిహారం కోసం రైతుల ఎదురుచూపులు

జిల్లాలో 60 వేల ఎకరాల పైగా పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. నష్టపరిహారం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రతిపక్షాలు అధికార పార్టీ నాయకులు నష్టపోయిన పంటలను పరిశీలించినప్పటికిని నష్టపరిహారం అందించే రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

నాలుగు రోజుల్లో కోద్దామనుకున్నా

బెస్త హనుమంతు. బోనాల్

కోతకొచ్చిన వరి పంట నాలుగు రోజుల్లో కోద్దామని అనుకున్నా. కానీ అకాల వర్షానికి నాకున్న నాలుగు ఎకరాలు పంట వడగండ్ల వాన గింజ లేకుండా చేసింది. పంట వేసినప్పటినుంచి కోతకచ్చే వరకు లక్ష రూపాయల పెట్టుబడి పెట్టిన. ఇప్పుడు గింజ లేక వరి కర్రలే మిగిలితే పశువులు మేస్తున్నాయి. పంట వేసినప్పటి నుంచి పురుగుల మందు కొట్టినా చేతికి వచ్చే టైములో వడగండ్లు అప్పుల పాలు చేసిందన్నారు.

5 ఎకరాల్లో గింజ కూడా లేదు

మనోహర్. భవానిపేట్

వడగండ్ల వాన కురవడంతో ఐదు ఎకరాల వరి పంట ఒక గింజ కూడా మిగలలేదన్నారు. ఒక లక్ష 25 వేల రూపాయల పెట్టుబడి మునిగిందన్నారు. అప్పులు చేసి పంట సాగు చేస్తే వడగండ్ల వాన కొంపముంచిందన్నారు.

భారంగా మారిన అద్దెలు

- కలగానే సొంతింటి నిర్మాణం
- స్వయంగా పనులు చేపట్టుకుంటున్న కూలీ కుటుంబం
- ఆదుకోవాలని వేడుకోలు

నవతెలంగాణ-బిచ్కుంద


గుంతలు తవ్వుతున్న భార్యభర్త

సమాజంలో ఎక్కువగా మధ్యతరగతి, దిగువన జీవిస్తున్న ప్రజలకు సొంతిల్లు ఉండాలనేది కల. దానిని ఎక్కువమంది సాకారం చేసుకోలేక వారి కలలు కలగానే ఉండిపోతున్నాయనేది పచ్చినిజం. సొంతిల్లు లేని కొందరు గ్రామాల్లో కొన్ని ఏళ్లుగా అద్దె బతుకులతోనే సర్దుకుపోతున్నారు. ముఖ్యంగా పట్టణాలు, నగరాల్లో సొంతిల్లు ఏర్పాటుచేసుకోవడం చాలామందికి అసాధ్యమనే కాలంలో పెరుగుతున్న జనాభా వేరుపడిన కుటుంబాలకు సొంతిల్లు నిర్మాణం చేసుకోవడం ఇప్పుడు గ్రామాల్లో కూడా భారంగా మారింది. పెరుగుతున్న భూముల ధరలు, నిర్మాణ వ్యయం పేద ప్రజలకు భారంగా మారి గ్రామాల్లో భూముల ధరలతో పాటు నిర్మాణ వ్యయం పెరిగిపోయి సామాగ్రి ధరలు, నిర్మాణ కార్మికుల వేతనాలను చూసి ఎందరో వెనుకడుగు వేస్తు తమ సొంత ఇంటి నిర్మాణ కలను సాకారం చేసుకోలేకపోతున్నారు. ఇందుకు నిదర్శనం బిచ్కుంద మండలంలోని శాంతాపూర్ గ్రామానికి చెందిన రాజు వ్యవసాయ కూలీగా తన కుటుంబంతో జీవనం కొనసాగిస్తూ గత కొన్నేళ్లుగా అద్దె గృహంలో తన కుటుంబంతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. శాంతాపూర్ గ్రామంలో సొంతిల్లు లేకపోవడంతో గతంలో తన పూర్వీకుల ద్వారా తన వాటాకు వచ్చిన 500 ఫీట్ల ఖాళీ స్థలంలో ప్రభుత్వం ద్వారా ఇల్లు నిర్మాణం చేయాలని స్థానిక నాయకులకు, ప్రజాప్రతినిధులకు దరఖాస్తులు సమర్పించి ప్రభుత్వం ద్వారా పేదల కోసం అమలవుతున్న డబుల్ బెడ్ రూమ్ పథకం ద్వారా ఇళ్ళు నిర్మాణం కోసం ఆర్థిక సాయం అందించాలని ఎన్నిసార్లు వేడుకున్నా అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు కానీ స్పందించలేదని రాజు ఆవేదన వ్యక్తం చేశారు. అద్దె ఇంటిలో ఉండడంతో తనకు నెలకు 15 వందల వరకు ఖర్చు అవుతుందని అద్దె ఖర్చు భారంగా మారడంతో గత్యంత్రం లేక తన 500 ఫీట్ల ఖాళీ స్థలంలో తెలిసిన వారితో ముగ్గు వేయించి పునాది తొవ్వడానికి కార్మికుల భారం మోయలేక తన భార్యతో కలిసి పునాది తవ్వడం మొదలుపెట్టాడు. ఇది గమనించిన చుట్టుపక్కల వాళ్ళు రాజుకు చేదోడుగా నిలిచి వారికి తోచిన సహాయం అందించారు. వ్యవసాయ కూలిగా జీవనం కొనసాగిస్తున్న తనకు గత కొన్నేళ్లుగా అద్దె భారం పెరిగిపోవడంతో గత్యంతరం లేక కనీసం పునాది వరకు కట్టుకొని చుట్టూర అడ్డంగా పాత రేకులు ఏర్పాటు చేసుకొని అందులో నివసించాలని నిర్ణయం తీసుకున్నట్టు రాజు ఆవేదన వ్యక్తం చేశాడు. శాంతాపూర్ గ్రామంలోనే సొంత ఇల్లు లేని వారు కనీసం 50 మంది వరకు ఉంటారని ప్రజా ప్రతినిధులు స్పందించి ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ పథకం ద్వారా ఖాళీ స్థలంలో ఇల్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం ద్వారా అందిస్తున్న మూడు లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందే విధంగా పేద ప్రజల సొంతింటి కల నెరవేరే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అద్దె భారం పెరుగుతోంది

రాజు . వ్యవసాయ కూలీ గ్రామం శాంతపూర్

గత కొన్ని ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాను. అద్దె భారం పెరిగిపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. తనకు డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేయాలని ఖాళీ స్థలంలో ఇల్లు నిర్మాణం చేసుకుంటానని స్థానిక నాయకులకు ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఎలాంటి ఆర్థిక సాయం అందలేదు. గత్యంతరం లేక కూలీల భారం మోయలేక నా భార్యతో కలిసి గత రెండు రోజులుగా పునాది తవ్వకం చేస్తున్నాను. ప్రభుత్వం ఇల్లు నిర్మాణం కోసం ఆర్థిక సాయం అందించాలని వేడుకుంటున్నాను.

విలీన సొసైటీ రద్దు


సీఎం కేసీఆర్, విప్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని కాచాపూర్ సొసైటీని బస్వాపూర్ సొసైటీ విలీనాన్ని రద్దు చేస్తు ప్రత్యేక సొసైటీగా ఏర్పాటు చేయడం పట్ల ఆదివారం విప్ చిత్రపటానికి ఎంపిపి గాల్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ కిష్టగౌడ్, సర్పంచ్ సులోచన సుదర్శన్ పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లడుతు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కాచాపూర్ సొసైటీని బస్వాపూర్ గ్రామంలో విలీనం చేశారని, అప్పటి నుండి రైతులు ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే గోవర్ధన్ దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్ళగా విలీనం చేసినా సొసైటీని రద్దు చేసి కాచాపూర్ సొసైటీగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కొరగా విలీనమైన సొసైటీని తిరిగి ప్రత్యేక సొసైటీగా ఏర్పాటు చేశారన్నారు. గ్రామ రైతుల తరపున ధన్యవాదాలు తెలిపి, గ్రామంలో ప్రత్యేక సొసైటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ సిద్ధా గౌడ్, మండల కోఆప్షన్ సభ్యురాలు సుల్తానా, మాజీ ఎంపీపీ సుదర్శన్, గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు బాలకిషన్, మహిళా విభాగం అధ్యక్షురాలు భాగ్య, వీరేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు బాపురెడ్డి, మాజీ సర్పంచ్ భూపతి, సొసైటీ డైరెక్టర్ రాజసింహారెడ్డి, నాయకులు జీవన్ రెడ్డి, మురళి, నీలం రెడ్డి, లోహిత్ రావు, మల్లారెడ్డి, రాములు, శివానందం గౌడ్, రాజిరెడ్డి, సిద్ది రాములు, రామస్వామి, దేవయ్య, భూమయ్య, రాజవ్వ, రేణుక, గ్రామ రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాతృమూర్తులందరికి శుభాకాంక్షలు

- స్పీకర్ పోచారం

నవతెలంగాణ-నసురుల్లాబాద్


తల్లిదండ్రుల చిత్రపటానికి స్పీకర్ వందనం

నా బలం, బలగం అమ్మ నాన్నే అని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆదివారం బాన్సువాడ పట్టణంలో స్పీకర్ నివాసంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అంతర్జాతీయ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నేడు బాన్సువాడ తన నివాసంలో అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా తల్లిదండ్రులు స్వర్గీయ పాపవ్వ-రాజిరెడ్డిల చిత్రపటాలకు పూలమాలవేసి నమస్సుమాంజలు తెలిపారు. తల్లుల త్యాగాలే బిడ్డల భవిష్యత్‌ను రూపుదిద్దుతాయని, అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాతృమూర్తులందరికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సృష్టి మొత్తంలో తల్లి ప్రేమ గొప్పదన్నారు. ఒక మనిషి ఎదుగుదలలో తల్లి పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. మహిళల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని స్పీకర్ తెలిపారు.

సీఎం సహాయ నిధి కింద చెక్కు పంపిణీ


చెక్కు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని ముస్తాపూర్ గ్రామంలో బాధిత కుటుంబానికి చెక్కు అందజేసినట్టు గ్రామ యూత్ అధ్యక్షుడు ఎర్ల సాయిలు తెలిపారు. ముస్తాపూర్ వాసి ఉప్పర్‌పల్లి స్వరూప భర్త గంగాధర్ గౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రి పాలయ్యారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే జాజాల సురేందర్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ ఆదేశానుసారం వారి కుటుంబానికి గ్రామ కమిటీ సభ్యులు చెక్కును అందజేశారు. ఆపదలో ఎమ్మెల్యే ఆదుకున్నారని లబ్ధిదారు స్వరూప కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చేరి అప్పులు చేసి చికిత్స పొందిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు ఎర్ల సాయిలు, వార్డు మెంబర్ జూకంటి లక్ష్మణ్, సీనియర్ నాయకులు చిన్నకాంతం వివేకనంద, వడ్ల రవి, వడ్ల రాజు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
4
సోమవారం 15 మే 2023

నేటి నుండి సీఎం కప్ క్రీడాపోటీలు ప్రారంభం

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో నేటి నుండి ఈనెల 17వరకు మూడు రోజులపాటు మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం క్రీడా పోటీలను ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్, ఖోఖో, క్రీడాపోటీలు ఉంటాయని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు పోటీల్లో పాల్గొని క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కోరారు. మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామపెద్దలు, యువకులు, సీఎం కప్ క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో విధిగా పాల్గొనాలని ఆయన కోరారు.

గన్నారంలో నేడు క్రీడా పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సోమవారం నుండి 17 వరకు సిఎం కప్ క్రీడోత్సవాలు ఇందల్ వాయి మండలంలోని గన్నరం గ్రామంలో సోమవారం నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాములు నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిఎం కప్ క్రీడోత్సవాల్లో భాగంగా మండల స్థాయి క్రీడలు గన్నరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఫుట్ బాల్, లాంగ్ జంప్, హై జంప్, షాట్ పుట్, ఖోఖో రన్నింగ్ పోటీలు ఉంటాయని రాములు నాయక్ తెలిపారు. ఆసక్తి గల యువకులు 15 నుండి 36 సంవత్సరలోపు స్త్రీ, పురుష క్రీడాకారులను ఎంపిక చేసి క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.ఈ క్రిడలలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..?

- గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- వేగం నిర్లక్ష్యమే కారణం

నవతెలంగాణ-ఆర్మూర్

ఉమ్మడి జిల్లాలోని-44, 63వ ప్రధాన జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఈనెల 9న మంగళవారం రెండు ద్విచక్ర వాహనాలను కంటైనర్ ఢీ కొట్టిన ఘటనలో ముగ్గురు మృతి చెందారు. ఇందులో ఆరు సంవత్సరాల చిన్నారి సైతం మృత్యువాత పడింది. ఇదే రోజు జక్రాన్‌పల్లి మండలంలోని సికింద్రా పూర్ జాతీయ రహదారి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని కారు ఢీకొనగా కేశ్‌పల్లి గ్రామానికి చెందిన కుమ్మరి లక్ష్మీ దుర్మరణం పాలయింది.. ఇటీవల ఆర్మూర్ నుండి నిజామాబాద్ వెళ్లే జాతీయ రహదారి మునిపల్లి వద్ద కారు టైర్లు బ్లాస్ట్ అయ్యి పట్టణానికి చెందిన వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. డిచ్‌పల్లి జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల్లో విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని 10 గ్రామాల సర్పంచులు ప్రజలు ఇటీవల ఆందోళన చేశారు. గత కొన్ని సంవత్సరాల కింద మెండోరా సమీపంలోని వ్యవసాయ బావిలో ఆటో పడి 11 మంది దుర్మరణం పాలైన ఘటన 8 గ్రామాలలో విషాదం నింపింది.. తెలంగాణ రాష్ట్రమంతా ఈ ఘటన సంచలనం



జాతీయ రహదారిపై జరిగిన రోడ్డుప్రమాద దృశ్యం (ఫైల్)

రేపింది. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని విచారణలో తేలింది.

జక్రాన్‌పల్లి మండలంలోని మునిపెల్లి వద్ద ప్రయాణికులతో వెళుతున్న వాహనం అవుటర్ రోడ్డు పక్కన పాడుబడ్డ బావిలో పడి 13 మంది దుర్మరణం పాలయ్యారు. 2015 సంవత్సరం పట్టణంలోని ధోబిఘాట్ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని మిర్దాపల్లి గ్రామానికి చెందిన గడ్డం వెంకన్న అక్కడికక్కడే మృతి చెందాడు ఇదే నెలలో పెర్కిట్ శివారులోని కోటార్మూరులో తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గజానన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అంకాపూర్ జాతీయ రహదారిపై ఎంసెట్ హాల్ టికెట్ తీసుకువచ్చేందుకు నిజామాబాదుకు వెళుతూ పట్టణానికి చెందిన పొద్దుటూరి మనీష్ రెడ్డి మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి కి చెందిన నక్క మనితేజ విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో చనిపోయినారు. జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతానికి చెందిన బండి సత్యనారాయణ కుటుంబ సభ్యులు, బంధువులతో బాసర దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న ఆటోను బస్సు ఢీకొనడంతో ఆరుగురు మృతి చెందారు.

స్పీడ్‌బ్రేకర్లు, సూచికలు లేకపోవడం కారణమే..

జిల్లాలోని జాతీయ రహదారులపై రక్తపాతం ఆగడం లేదు. రోడ్డు ప్రమాదాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది.. క్షేమంగా ఇంటికి వెళ్తామన్న భరోసా లేకుండా పోయింది ముఖ్యంగా రహదారి మూలమలుపు వద్ద ప్రయాణికుల భద్రత గాలిలో దీపంలా మారింది. డ్రైవింగ్ రానివారు కూడా రహదారులపై ప్రయోగాలు చేయడం వల్ల ప్రాణాలు పోయిన ఘటనలు ఉన్నాయి. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం రోడ్డు పక్కనే దట్టమైన పెద్ద పెద్ద రాళ్లు ఉండడం, భారీ మూల మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు పెట్టకపోవడం, సూచిక బోర్డులు లేకపోవడం ప్రమాదాలకు కారణం అవుతున్నాయి..

ప్రజల్లో అవగాహన కల్పించాలి

రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించడానికి అన్ని శాఖల సమన్వయంతో పనిచేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. వాహన దారులు ట్రాఫిక్ రూల్స్ పాటించే విధంగా చూడాలని ,ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ఇద్దరు కంటే ఎక్కువ నడిపితే కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం..

వాహనదారులు నియమ నిబంధనలు పాటించనిచో కఠిన చర్యలు తీసుకుంటాం. ఇటీవల ఆటో డ్రైవర్లతో సమావేశం సైతం నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నాం.

సురేష్ బాబు, స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఆర్మూర్

వివాహిత అదృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ నగరంలోని నాలుగో పోలీస్ స్టేషన్ పరిధిలోగల వినాయక్ నగర్ పరిధిలో వివాహిత అదృశ్యమైనట్లు నిజామాబాద్ నాలుగవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సందీప్ కుమార్ తెలిపారు. తన భార్య ఇంటి నుండి వెళ్లిపోయిందని అంగార్ శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ప్రవేటు స్కూల్లో టీచర్‌గా పనిచేస్తుంది. ఈనెల 12న డ్యూటీ ముగించుకొని మధ్యాహ్న భోజనానికి ఇంటికి వచ్చి వెళ్లిందని, తర్వాత తిరిగి రాలేదని తన భర్తతోపాటు కుటుంబ సభ్యులు ఎంత వచ్చినా ఆచూకీ లభ్యం కాలేదు. ఎవరైనా గుర్తిస్తే నాలుగో పోలీస్ స్టేషన్ ఎస్ఐ సందీప్ లేదా డయల్ వందకు లేదా కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని ఎస్సై పేర్కొన్నారు.

గురుకుల విద్యార్థినికి సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన లింగాపురం గంగారాం , లావణ్య ల కూతురు నితీష గురుకుల పాఠశాల కంజర లో పదో తరగతి పరీక్షల్లో 9.7 ఉత్తీర్ణత సాధించినందుకు సర్పంచ్ నోముల విజయలక్ష్మి లక్ష్మారెడ్డి ఆదివారం నితీషను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నితీష ఉన్నత చదువులు చదివి ఐఎఎస్ కావాలని, దానికోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని వారన్నారు. కార్యక్రమంలో తీగల అశోక్, లోకం కన్నయ, అసది రంజిత్, తీగల రాజు, విలేకర్ గంగాధర్, తలారి సాయిలు,మన్నే లక్ష్మన్, తీగల గంగ శరత్, గుండ సుకేష్ తల్లి తండ్రులు లింగాపురం గంగారాం, లావణ్య దంపతులు పాల్గొన్నారు.

మలేషియా జైలులో శాబ్దిపూర్ వాసి

- కోటపాటిని కలిసిన కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్



కోటపాటికి వినతిపత్రం అందజేస్తున్న బాధిత కుటుంబీకులు

మలేషియా జైలులో శిక్ష అనుభవిస్తున్న శాబ్దిపూర్ గ్రామవాసిని స్వదేశానికి రప్పించాలని ఆదివారం పట్టణంలో కోటపాటిని కలిశారు. ఉపాధి కోసం తొమ్మిది నెలల క్రితం బాదావత్ గణేష్ అనే యువకుడు విజిట్ వీసాపై మలేషియాకు వెళ్లాడు. అక్కడి నిబంధనలను ఉల్లంగించి, ఏజెంటు చెప్పిన పని లేక పోలీసులకు పట్టుబడి క్లియలో శిక్ష అనుభవిస్తున్నాడు . ఇండియాకు రావాలంటే పాస్‌పోర్టు లేదు. పెనాల్టీ కట్టి వెళ్లవలసిందిగా అక్కడి అధికారులు ఆదేశించిన నేపథ్యంలో కామారెడ్డి జిల్లాలోని శాబ్దిపూర్ గ్రామవాసులు అయిన కుటుంబ సభ్యులు, మాక్లూర్ మండలం మాణిక్ బండార్ గ్రామస్తులైన గణేష్ బంధువులతో పట్టణంలో ని ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షులు అయిన కోటపాటి నరసింహం నాయుడును వారి కార్యాలయంలో కలిశారు. తన భర్తను ఏ విధంగానైనా ఇంటికి రప్పించాల్సిందిగా వేడుకున్నారు. వెంటనే కోటపాటి స్పందించి పూర్తివివరాలు మలేషియాలోని తెలుగు సంఘం అధ్యక్షులు ఆనంద్ పంపి ఇండియన్ ఎంబసీ అధికారులతో మాట్లాడి గణేష్‌ను ఇండియాకు క్షేమంగా పంపాలని కోరారు. తెలుగు సంఘం అధ్యక్షులు ఆనంది స్పందించి తమ వంతు సహాయం చేస్తానని హామీనిచ్చాడు. కోటపాటిని కలిసిన వారిలో భార్య నిహారిక బావమరిది రవీందర్, (మాణిక్ బండార్) తమ్ముడు, కళ్యాణ్, గల్ఫ్ కార్మిక నాయకుడు మలోత్ మోహన్ ఉన్నారు.

నేడు మల్లారంలో చీఫ్ మినిస్టర్ కప్-2023

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

తెలంగాణ ప్రభుత్వం నిర్వహించబోయే చీఫ్ మినిస్టర్ 2023వ కప్ సోమవారం నుండి ఈనెల 17 వరకు జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో మల్లారం ఉన్నత పాఠశాలలో నిర్వహించబోతున్నారు. అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్ గేమ్స్‌ని యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా ఒలింపిక్ అధ్యక్షులు, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, నిజామాబాద్ రూరల్ జడ్పీటీసీ బొల్లెంక సుమలత గోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. పాల్గొనేవారు గ్రామ పంచాయతీలో పేర్లు నమోదు చేసుకోవాలి విజ్ఞప్తి చేశారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన బీజేపీకి చెంపపెట్టులాంటి ఫలితం

- ఇకపై అంతటా ఇవే రిజల్ట్స్ రిపీట్
- కర్ణాటక ఎన్నికల ఫలితాలపై ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ వ్యాఖ్యలు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్



కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి గద్దెనెక్కిన బీజేపీకి అక్కడి ఓటర్లు చెంపపెట్టులాంటి తీర్పును వెలువరించారని, ఇకపై ఇవే ఫలితాలు అంతటా రిపీట్ అవుతాయని టీఎస్ ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలపై ఆయన తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. బీజేపీ అప్రజాస్వామిక, నియంతృత్వ, మతతత్వ విధానాలను ప్రజలు తిప్పికొట్టి ఆపార్టీకి ఘోరి కడతారని మతతత్వాన్ని రెచ్చగొట్టి, ప్రజలను మాయమాటలతో లోబర్చుకుని, భ్రమల్లో ముంచాలనే ఆ పార్టీ క్షుద్రవిద్యలను ప్రజలు తిప్పికొడతున్నారని బాజిరెడ్డి తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నాయకుల నాటకాలు ఇకపై సాగబోవని ఆయన స్పష్టం చేశారు. కర్ణాటక మాదిరిగానే ఇతర రాష్ట్రాల్లో కూడా అప్రజాస్వామికంగా బీజేపీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకున్నదని, అక్కడ కూడా త్వరలో ఇవే ఫలితాలు రాబోతాయని జోస్యం చెప్పారు. దేశ వ్యాప్తంగా కూడా బీజేపీ పని ఖతమైపోతున్నదని, కర్ణాటకలో ఫలితాన్ని ముందుగా అంతా ఊహించిందేనని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యయుతంగా ప్రజలతో ఎన్నుకోబడిన ప్రభుత్వాలను కూల్చిన చరిత్ర బీజేపీదని, ప్రజల నుంచి వీరికి గుణపాఠం తప్పదని బాజిరెడ్డి హెచ్చరించారు. బీజేపీ ఎమ్మెల్యేలు పూర్తిగా లంచగొండ్లుగా తయారయి ప్రజలను పీడించారని, అందుకే అన్ని చోట్ల ఆ పార్టీ ప్రజాప్రతినిధులపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. బీజేపీ స్వయంగా గెలిచిన రాష్ట్రాల్లో కూడా ఓటమిపాలు కాకతప్పదని, ఈ పార్టీతో, వీరి పాలనతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని ప్రజలు గమనించారన్నారు. కేరళా ఫైల్స్, కశ్మీర్ ఫైల్స్ అంటూ ప్రజలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడం తప్ప.. బీజేపీతో ప్రజలకు నయాపైసా లాభం లేదని, అంతా నష్టమేనన్నారు. ఆ కష్టనష్టాలను, అప్రజాస్వామిక పాలనను కళ్లారా చూసిన ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టేందుకు రెడీగా ఉన్నారని, కర్ణాటక ఫలితాలే దీనికి నిదర్శనం, నాంది అని బాజిరెడ్డి గోవర్ధన్ స్పష్టం చేశారు.

పట్టణంలో స్వచ్ఛత , ఐక్యత కార్యక్రమం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో ఆదివారం స్వచ్చత, ఐక్యత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వచ్చత, ఐక్యత కోసం ప్రతి ఆదివారం స్వచ్ఛ కాలనీ, సమైక్య కాలనీ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ ప్రారంభించారు. ఇందులో భాగంగా అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు చీపుర్లు పట్టుకొని ప్రధాన రోడ్డుపై చెత్తను ఊడ్చారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించారు. మురుగు కాలువలలో నీటి ప్రవాహానికి అడ్డంకిగా నిలిచిన రాళ్లను, ప్లాస్టిక్ కాగితాలను, వ్యర్థాలను తొలగించి పరిశుభ్రం చేశారు. మురుగు కాలువలలో ప్లాస్టిక్ కాగితాలు, వ్యర్థాలు వేయొద్దని, రోడ్లపైకి మురుగు నీరు రాకుండా చూడాలని, పరిసరాలను చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ మాట్లాడుతూ పట్టణంలోని కాలనీని స్వచ్ఛంగా, సమైక్యంగా ఉంచాలన్న సత్సంకల్పంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రతి ఆదివారం కాలనీ వాసులమంతా కలిసి రెండు గంటలు శ్రమదానం చేసి, పరిసరాలను శుభ్రం చేస్తామని, స్వచ్ఛత, ఐక్యత, అభివృద్ధిలో జర్నలిస్టు కాలనీని ఆదర్శంగా నిలుపుతామని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి బి.కమలాకర్, కోశాధికారి ఆర్.సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షులు కొక్కెర భూమన్న, సుంకె శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి కొంతం రాజు, ప్రచార కార్యదర్శి చిలివేరి రాజ్ కుమార్, కార్యవర్గ సభ్యులు రాగి నర్సయ్య, అబ్దుల్ ఆవేజ్, కాలనీవాసులు ఎల్టీ.కుమార్, భూమయ్య, దినేష్, రవి, గణపతి, మోహన్, గంగాధర్, నారాగౌడ్, ప్రవీణ్, భాజన్నపాల్గొన్నారు.



చెత్తను తొలగిస్తున్న కాలనీవాసులు

కరాటేలో గోవూర్ విద్యార్థుల సత్తా



నవతెలంగాణ-(వర్ని)మోస్రా

రాజధాని హైదరాబాదులో జరిగిన కరాటే కుంగ్‌ఫూ పోటీల్లో మోస్రామండలంలోని గోవూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిలు సత్తా చాటారని కరాటే మాస్టర్ అశోక్ గూడ ఆదివారం తెలిపారు. ప్రత్యూష కరాటేలో మొదటి స్థానంలో గోల్డ్ మెడల్ సాధించగా, మాధురి ద్వితీయ స్థానంలో సిల్వర్ మెడల్ పతకాలను సాధించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ ప్రజలు విద్యార్థి లకు అభినందనలు తెలిపినట్లు పేర్కొన్నారు.

వ్యవసాయ శ్రామికుడు.. పంటల రక్షకుడు

- పంటలు కాపాడేలా పరికరాల తయారీ
- రైతులకోసం నిరంతరం శ్రమిస్తున్న మహేష్ రెడ్డి
- సెంట్రల్ అగ్రికల్చర్ మీటింగ్ సైతం హాజరు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఒక వ్యక్తికి ఏ పని అయిన చేయాలనే తపన, నేర్చుకోవాలనే కోరిక ఉంటే పెద్ద పెద్ద చదువులు చదవడమే ముఖ్యం కాదని నిరూపించాడు. ఏర్గట్ల మండలకేంద్రం, నిజామాబాద్ జిల్లాకు చెందిన యువరైతు పొత్యూరి మహేష్ రెడ్డి. రైతుల కోసం తక్కువ ఖర్చుతో వారికి ఉపయోగపడే యంత్రాలను తయారు చేస్తూ.. రైతులు, వ్యవసాయాధికారుల మన్ననలు పొందుతున్నాడు. ఏర్గట్లకు చెందిన పొత్యూరి మహేష్ రెడ్డిది సాధారణమైన రైతు కుటుంబం. కేవలం 10 వ తరగతి వరకే చదివినప్పటికి రైతుల కోసం ఉపయోగపడే యంత్రాలను తయారు చేశాడు. ఇప్పటికి రైతులకు పంటల విషయంలో మంచి,మంచి సలహాలు సైతం ఇస్తాడు.



మంకీ గన్‌తో మహేష్‌రెడ్డి

మహేష్ రెడ్డికి చిన్న నాటి నుండి ప్రజలకు, రైతులకు ఉపయోగపడే వస్తువులను తయారు చేయడం అంటే మహా సరదా ఇందులో భాగంగానే మొట్టమొదటి సారిగా 2004-05 సంవత్సరం 10వ తరగతి చదివే రోజుల్లో జిల్లా స్థాయిలో కామారెడ్డిలో జరిగిన సైన్స్ ఫెయిర్ పోటీలకు ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ఎంపికై హాజరయ్యారు. ఇందులో భాగంగా "ట్రాఫిక్ సిగ్నల్"అనే దానిని ఎంపిక చేసుకొని రిమోట్ సహాయంతో వాహనాలు ఎలా వెళ్ళాలో, ఎలా వెళ్ళకూడదో చేసి చూపించి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. తర్వాత కొన్ని అనివార్య కారణాల వల్ల తన చదువును కొనసాగించక పోయినప్పటికి, రైతుల కోసం ఏదో చేయాలనే తపన అలాగే ఉండిపోయింది.



పంటకు మందు చల్లుతూ..

తక్కువ ఖర్చుతో రైతులకు ఉపయోగపడే యంత్రాల తయారీ

మొక్కజొన్న, జొన్న, సజ్జ పంటలను పక్షులు నాశనం చేయడం గ్రహించి 2017లో కేవలం 200 రూపాయలతో గాలి ఫ్యాన్ తయారీ చేశాడు.గాలి సహాయంతో ఫ్యాన్ ప్లేట్ కు తగిలి శబ్దం చేయగానే పిట్టలు ఎగిరిపోయేలా చేసాడు.

2019లో మంకీ గన్ తయారీ

కోతుల బెడద నుండి పంటలను రక్షించుకునేందుకు కేవలం 420 రూపాయల వ్యయంతో మంకీ గన్ అనే పరికరాన్ని తయారు చేశాడు. ఇది అప్పట్లో మహేష్ కు మంచి పేరు తెచ్చిపెట్టింది.సోషల్ మీడియా, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో ఇది వైరల్ అవడంతో మంకీ గన్‌లను చుట్టుపక్కల జిల్లాల నుండి చాలా మంది రైతులు వచ్చి కొనుక్కొని మరి వెళ్ళారు. దీని తయారీ వీడియోను హైదరాబాద్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వరకు పంపించారు.

2020లో ఫర్టిలైజర్ గన్ తయారీ..

రైతులు పంటలు వేశాక యూరియా చల్లే విషయంలో రైతు వంగి యూరియా వేయకుండా, నిలబడి వేసే విధంగా... నలుగురు చేయవలసిన పనిని ఒక్కరే చేసే విధంగా 320 రూపాయలతో ఫర్టిలైజర్ గన్ ను తయారు చేసి ఔరా అనిపించాడు. ఆయన ఆవిష్కరించే ప్రతిదీ రైతులకు సులువుగా, తక్కువ ఖర్చుతో ఉండడం వల్ల ఈ యంత్రాలపై రైతులు మక్కువ చూపిస్తున్నారు.

కెమికల్స్ లేకుండా ఆర్గానిక్ పంటలు

మహేష్ రెడ్డి రైతులకు నిజంగా ఆదర్శప్రాయుడే కెమికల్స్ తో పండించే పంటల వల్ల ఈ రోజుల్లో మ నిషి ఆయుర్దాయం తగ్గిపోయి త్వరగా చనిపోతున్నారు. ఇది గ్రహించిన తాను కేవలం తన ఇంటి కోసం మాత్రమే ఆర్గానిక్ పండ్లు, కూరగాయలు పండిస్తున్నారు. ఆర్గానిక్ పంటలు అందరి కోసం పండించ వచ్చు గానీ,ఆర్గానిక్ పంటల వల్ల దిగుబడి తక్కువ, ఖర్చు ఎక్కువ అవుతుందని,ప్రభుత్వం ఏదైనా రాయితీ ఇస్తే పండించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు .

మంకీ గన్,ఫర్టిలైజర్ గన్ లు తయారు చేసినప్పుడు సోషల్ మీడియా, ప్రింట్ మీడియా ద్వారా గుర్తింపు పొంది "ఇంటింటికి ఇన్నోవేషన్"లో పాల్గొని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా 2022 ఆగస్టు 22 న ప్రశంసా పత్రం అందుకున్నారు. ఆయన తయారు చేసిన పరికరాలను సైతం ఎమ్మెల్సీ కవిత గమనించి ట్విట్టర్ వేదికగా మాట్లాడుతూ...వ్యవసాయాన్ని వృత్తిగా ఎంచుకుని తక్కువ ఖర్చుతో రైతులకు మేలు చేసే యంత్రాలను తయారు చేస్తున్న నిజామాబాద్ జిల్లా యువరైతు మహేష్ రెడ్డికి నా అభినందనలు అని అన్నారు.

సెంట్రల్ అగ్రికల్చర్ మీటింగ్‌కు పిలుపు

వ్యవసాయంలో నూతన ఒరవడులు సృష్టించి రైతులకు ఉపయోగపడే పనులను చేస్తున్న మహేష్ రెడ్డిని ఏర్గట్ల మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ ప్రోత్సహించి మహేష్ పేరును జిల్లా వ్యవసాయాధికారులకు పంపడంతో... జిల్లా నుండి యువరైతు మహేష్ రెడ్డికి సెంట్రల్ అగ్రికల్చర్ ఇన్స్టిట్యూట్ నుండి పిలుపు వచ్చింది. ఈ మీటింగ్ ను హైదరాబాద్ లో ఈ సంవత్సరం అనగా 2023 సంవత్సరం 3 వ నెలలో నిర్వహించారు. ఇందులో మహేష్ కు పసుపులో బ్రీడ్ పద్ధతిలో కూలీల సంఖ్యను, ఖర్చును తగ్గించుకొని అధిక దిగుబడిని ఎలా పొందవచ్చు, పంటలకు డ్రోన్ స్ప్రే ఎలా చేయవచ్చు, కూలీల సంఖ్య, అధిక ఖర్చు ఎలా తగ్గించుకోవచ్చు,గొర్రెల,మేకల పెంపకం, తక్కువ నీటితో బిందు సేద్యంతో పంటలను ఎలా పండిచవచ్చు అని శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించినట్లు మహేష్ తెలిపారు. అనంతరం సెంట్రల్ అగ్రికల్చర్ వారు ప్రశంసా పత్రం సైతం ఇచ్చి రైతులకు ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలని సూచించినట్లు తెలిపారు.

